పోలీసుల తీరుపై నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంతకు వస్తున్న బుంగపుట్టు, లక్ష్మీపురం, బరడ, రంగబయలు, వనుగుమ్మ తదితర గ్రామాల గిరిజనులను పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదివాసి గిరిజనలు వాపోయారు. లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ఆధ్వర్యాన స్టేషన్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. శనివారం పాత్రికేయుల వద్ద తమ ఆవేదన వ్యక్త పరిచారు. వారపు సంతకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తున్న తమను వివిధ కారణాలతో తీసుకువెళ్లి గంజాయి నిందితులుగా చిత్రీకరించి పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ అమాయక గిరిజనులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి. భీమరాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.నర్సయ, పి.రామదాసువి లైకన్, వి.గణపతి, కె.శంకర్‌రావు, మలేష్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నేతలు

భోగి మంటల్లో జిఒ 2 ప్రతులు

అరకులో భోగి మంటల్లో జిఒ 2 ప్రతులు వేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-అరకు లోయ :
మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం భోగి మంట వేసి ఎస్మా చట్టం కాపీలను మంటలో వేసి దగ్ధం చేశారు. అంగన్వాడీల సమస్యలు సమగ్రంగా చర్చించి పరిష్కరించ వలసిన మంత్రి బొత్స సత్యనారాయణ ఇందులో రాజకీయ కుట్ర దాగి ఉందని చెప్పడం సమంజసం కాదని అంగన్‌వాడీలు తెలిపారు. అధికారం కోసం హామీలు ఇవ్వడం కాదని, ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలు పని చేయకపోతే నిలదీసి అడగాలని అనేక సందర్భాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆవేదనతో గతంలో మాట్లాడారని, ఆ మాటలు ప్రస్తుతం ఏమి అయ్యాయని తెలిపారు. సంక్రాంతి తర్వాత ఉధృతంగా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. తదుపరి జరిగే పరిణామాలకు చర్చల పేరుతో మోసం చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యమంత్రి బాధ్యత వహించవలసి ఉంటుందని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే గతంలో చంద్రబాబు నాయుడు కు పట్టిన గతే పడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు దురియ నాగమ్మ, మండల కార్యదర్శి కొర్రా లక్ష్మి, మండల అధ్యక్షులు పాంగి. వెంకటలక్ష్మి, శారదా, సునీత, అరుణ, శాంతి, నిర్మల ,నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: తమకు కనీస వేతనం 26 వేల వేతనం పెంచాలని కోరుతూ సమ్మె చేపట్టి శనివారంతో 33 రోజులకు చేరుకుంది. అంగన్వాడిల సమ్మెకు మద్దతుగా యుటిఎఫ్ నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి పుడిగి దేముడు, జిల్లా కౌన్సిలర్ జమితి సత్యనారాయణ మాట్లాడుతూ, న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు సోమేలి గంగరాజు, అంగన్వాడీ మండల యూనియన్ నాయకురాలు పి.మంజుల, సిఎస్ కళావతి, కె.లక్ష్మి, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు

ముంచింగిపుట్టు: సమస్యలను పరిష్కారం చేయాలని శనివారం మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మౌలమ్మ మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనంగా నెలకు రూ.26000 ఇవ్వాలని, గ్రాట్యుటీతో వివిధ రకాల డిమాండ్స్ ను పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు, జర్ల వైస్ సర్పంచ్ గణపతి, అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీల సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చింతూరు

అంగన్వాడీల ఆందోళనల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్త పిలుపు శనివారం చింతూరులో సంతకాల సేకరణ చేపట్టారు. దీనికి ముందు 33వ రోజు నిరాహార దీక్షలనున్యాయవాది మడివి రవితేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు నూకరత్నం, వెంకటరమణ, కామేశ్వరి, కనకదుర్గ, భద్రమ్మ, ముత్తమ్మ, సత్యవతి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో..

రంపచోడవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో అంగన్వాడీ వర్కర్స్ చేపట్టిన దీక్ష 33వ రోజున యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం అంగన్వాడీల దీక్షకు మద్దతుగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజలు, లబ్ధిదారుల నుండి సంతకాలను సేకరించారు. అనంతరం గ్రామంలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వెంగళరావు, కారం సూరిబాబు, సనాతన బాబు, అంగన్వాడి లీడర్స్ కెవి రామలక్ష్మి, ఎం మంగయమ్మ, దేవీపట్నం, రంప చోడవరం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలో రేఖపల్లి జంక్షన్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 33 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, ముసురు రాజేశ్వరి, సిహెచ్ సుబ్బారావు, సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, కమ్మచిచ్చా సత్యనారాయణ, నాల్లారపు ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

రాజవొమ్మంగి : స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం సర్కిల్‌గా ఏర్పడి నిరసన తెలిపారు. రహదారిపై లయబద్ధంగా నృత్యాలు చేశారు. భిక్షాటన, కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని బెదిరింపు చర్యలకు పూనుకున్నా భయపడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు టి శ్రీను, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ కుమారి, కె.వెంకటలక్ష్మి, ఎల్.సత్యవతి, నూకరత్నం, రమణ, రమణి, మంగ, సుందరమ్మ, రత్నం, మేరీ, రాధ, భవాని, రాజేశ్వరి, లక్ష్మి, వీరయ్యమ్మ, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సజ్జల చిత్రపటం దగ్ధం

సీలేరు : అంగన్వాడీల సమ్మెపై దుష్ప్రచారం చేస్తున్న రాష్ట్ర సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రపటాన్ని జికె.వీధి మండల కేంద్రంలో అంగన్వాడీలు శనివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గడుతూరు సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పల నరసమ్మ, ఎల్.సత్యవతి, గాలకొండ ఎంపిటీసీ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో..

రాజ ఒమ్మంగిలో..



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు లలిత

అంగన్వాడీల సమస్యలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించాలి

ప్రజాశక్తి-కూనవరం

అంగన్వాడీల సమస్యలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించాలని సిఐటియు నాయకులు లలిత డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్వాడీలు 33 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ఈ ప్రాంతంలో తమ ఓట్లతో గెలిచిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కనీసం తమ ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేయడం పేర్కొన్నారు. కనీసం ఆందోళనకు సంఘీభావం పలకరింపు, భరోసా ఇవ్వటానికి సైతం చేయడం లేదని, పూర్తిగా ముఖం చాటేయడం సరికాదని పేర్కొన్నారు. సమస్యలు విని ప్రభుత్వానికి చేరవేయటానికి ప్రజాప్రతినిధులే వారధులని, ఆ పని చేయకుండా తప్పించుకొని తిరగటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, అన్నపూర్ణ, ప్రసన్న కుమారి, శ్రీదేవి, కుమారి, గౌరి, సిఐటియు మండల అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

రేషన్ బియ్యం ఇవ్వకపోవడంపై నిరసన

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరులో తెల్లరేషన్ కార్డుదారులకు జనవరి నెల రేషన్ బియ్యం పూర్తిస్థాయిలో అందకపోవడంపై లబ్ధిదారులు గ్రామ సచివాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు జనవరి నెల రేషన్ బియ్యం అందలేదన్నారు. దీనిపై ఎండియు ఆపరేటర్‌ను అడిగితే జిసిసి పంపించిన అలాట్మెంట్ ప్రకారం బియ్యం పంపిణీ చేశామని, 400 కేజీల వరకు బియ్యం తక్కువగా జిసిసి అధికారులు పంపించారని ఆయన చెప్పారని పేర్కొన్నారు. బియ్యం తక్కువ వచ్చిన విషయాన్ని జిసిసి అధికారులు దృష్టికి సీలేరు ఎంపిటిసి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపించారు. జిసిసి సూపరింటెండెంట్ నిర్లక్ష్యం కారణంగా తమకు బియ్యం అందలేదన్నారు. గతంలో కూడా ఇదే విధంగా జరిగితే స్థానిక ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి కలెక్టర్ సమిత్ కుమార్ దృష్టి తీసుకెళ్లడంతో నాడు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ చేశారని గుర్తు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవచూపి తమకు బియ్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా జిసిసి సూపరింటెండెంట్ తీరు మార్చుకొని లబ్ధిదారులకు బియ్యం అందేల చర్యలు చేపట్టకపోతే సీలేరు జిసిసి ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గొందివాడ గ్రామస్తులతో ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వాతి

గిరిజనులకు దుప్పట్లు, దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని చట్లవాడ పంచాయతీ పరిధి గొందివాడ గ్రామంలో శనివారం ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ రవీంద్రనాథ్ ఆదేశాల మేరకు సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. గ్రామంలోని పిల్లలకు ఆట వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంతకు తరలివచ్చిన ప్రజలు

హుకుంపేటలో సంక్రాంతి సందడి

- జనాలతో వారపు సంత కిటకిట

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో సంక్రాంతి సందడి నెలకొంది. శనివారం నుంచి పండుగ మొదలు కావడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి మోదకొండమ్మ గుడి వరకు జనాలతో కిక్కిరిసి పోయింది. గిరిజన ప్రాంతంలో గిరిజనులు పండించిన పంటలను అమ్మకాలు జరిపి పండగ చేసుకోవడం ఆనవాయితీ. పండగ సంత కావడంతో గిరిజనులు తండోప తండాలుగా తరలి వచ్చారు. పండగకు కావలసిన సామాగ్రిని దుస్తులను కొనుగోలు చేశారు. బట్టలకు కాస్త రేట్లు పలికింది. పిల్లల దుస్తుల ధరలు రూ.700 నుంచి 1500 వరకు ఉన్నాయి. పెద్దవారికి వేయి రూపాయల నుంచి అమ్మకాలు జరిగాయి. నాటు కోళ్లు, మేకలకు మంచి గిరాకీ ఏర్పడింది. నాటు కోళ్లకు రూ.1000 నుంచి 2000, మేకలకు రూ.7000 నుంచి 20,000 వరకూ అమ్మకాలు జరిగాయి.

సంతలో వాయిద్య పరికరాలు

సంక్రాంతికీ సాగని వ్యాపారాలు

బోసిపోయిన సీలేరు

ప్రజాశక్తి -సీలేరు

సంక్రాంతి సీజన్‌లోనూ జీకే వీధి మండలం సీలేరులో వ్యాపారాలు సాగడం లేదు. కొనుగోలుదారుల్లేక సీలేరు బోసిపోయింది. వారం రోజుల నుంచి వ్యాపారాలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతి ఏటా సంక్రాంతికి పెద్ద మొత్తంలో వ్యాపారం సాగేది. సంక్రాంతి ముందు ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం చుట్టుపక్కల నుంచి గిరిజనులు తీర్థాలను తలపించే విధంగా సీలేరు చేరుకొని వారికి కావలసిన బట్టలు, సరుకులు కొనుగోలు చేసి వెళ్లేవారు. ఈ ఏడాది కూడా ఎప్పటి మాదిరిగానే వ్యాపారం సాగుతుందని భావించిన వ్యాపారులకు నిరాశే మిగిలింది.

ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు సరిగా పండలేదు. మరో వైపు అరకొరగా పండిన పంటలు తుపాను రావడంతో ఆ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట చేతికి రాక గిరిజనుల దగ్గర డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. దీంతో బట్టలు, సరుకులు కొనుగోలు చేయడానికి గిరిజనులు రాలేదు.

దీనికి తోడు పొరుగు రాష్ట్రమైన ఒడిశాలో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు ఏర్పాటు కావడంతో గిరిజనుల చెంతకే వ్యాపారులు వెళ్లి వారికి కావలసిన బట్టలు, నిత్యవసర సరుకులు విక్రయిస్తున్నారు. మరి కొంతమంది గిరిజన గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి గిరిజనులకు అన్ని సరుకులు అందుబాటులో తీసుకొచ్చారు. దీంతో మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు సీలేరులో దుస్తులు, నిత్యాసరుకులు కొనుగోలు చేయటానికి సీలేరు రావడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

సీలేరు సమీపంలోని ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండకు ఒడిశా ప్రభుత్వం తక్కువ ఛార్జీలతో బస్సు ఏర్పాటు చేయడం ఆ పరిసర గ్రామాల గిరిజనులు అక్కడకు వెళ్లి వారి కావలసిన బట్టలు, నిత్యవసర సరుకులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి వారి గ్రామాలకు బస్సులో వెళ్ళిపోతున్నారు. దీంతో సీలేరు రావటానికి గిరిజనులు ఆసక్తి చూపడం లేదు. మరో వైపు ఆన్‌లైన్ వ్యాపారం కూడా స్థానికంగా వ్యాపారాలను దెబ్బతీస్తోంది. సీలేరుకు మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు రాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్ నిర్మానుష్యంగా ఉంటుంది.

కొనుగోలుదారులు లేక బోసిపోయిన సీలేరు దుకాణాలు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: ముసలమ్మ చారిట బుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో మండలంలోని రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో 80 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారు చిట్టి శనివారం మాట్లాడుతూ, చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేవుపోలవరం సర్పంచ్ చోడిపల్లి గోవింద్, గనగళ్ళ రాజేష్, చోడిపల్లి గంగరాజు, ఎరిపల్లి ముసిలి, ధోని వెంకన్న, జామి అప్పలరాజు, మధు, సూరి, శంకర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణానికి చెంది వినాయక రామకృష్ణ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ 8వ వార్డు రామారావుపేటలోని శ్రీసంపత్ వినాయక ఆలయం వద్ద దివ్యాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి. జయరాం, తహశీల్దార్ అన్నాజీరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ హాజరై వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు

ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుమ్మిరేవుల పంచాయతీ పరిధి చెరుకుమల్లు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత వైద్యాధికారి ఆదివాసీల గృహాల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ గిరిజనులు సీజనల్ వ్యాధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. చలితో కూడిన జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వేసుకోవాలన్నారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రసవ సమయానికి ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఆసుపత్రికి దూరంగా ఉన్న గర్భిణులు ప్రసవ సమయానికి 10 రోజుల ముందు చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరి సుఖ ప్రసవం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లోవ కుమారి, ఏఎన్ఎం మత్స్య కొండ, సీత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి- కూనవరం

ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య విమర్శించారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు కనీసం మంచి నీరు అందించటానికి నిధులు మంజూరు చేయడం లేదన్నారు. వరదలు, తుపాన్ కారణంగా నష్టపోయిన బాధితులకు న్యాయం చేయలేదన్నారు. స్కూల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదన్నారు. గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే రోడ్లను బాగు చేయాలని కోరారు. పండుగ ఇవ్వాల్సిన నిత్యావసరాలు ఇవ్వలేదన్నారు. గిరిజన ప్రాంతాల సమస్యలు స్థానిక ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుకు, వైసిపి ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్నారు. ప్రజలను మాటలతో ఇంకా మోసం చేయడం తగదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పాయం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా న్యాయస్థానము
భద్రాద్రి-కొత్తగూడెం
D.O.P.NO : 18/2023

బిట్వీన్ :
బత్తుల సత్యవేణి @ పళ్ళ సత్యవేణి
...**పిటిషనర్**

మరియు :
బత్తుల అన్వేష్ ...**రెస్పాండెంట్**

TO
బత్తుల అన్వేష్ S/o వెంకటేశ్వర్లు, వయస్సు 30 సం॥, వృత్తి: రోజు వారి కూలీ, ప్రైమరి ఎయిడెడ్ స్కూలు ప్రక్కన ఎటపాక, తూర్పుగోదావరి జిల్లా ఆం॥ ప్ర॥

సదురు పిటిషన్ మీ యెక్క హాజరు కొరకు ది॥ 31-01-2024 రోజున ఉ॥ 10.30 ని॥లకు వాయిదా కలదు. హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మాణించబడును.

కోర్టు వారి అనుమతితో

ఇట్లు
అంబటి రమేష్
M. తరుణి
పిటిషనర్ తరపున న్యాయవాదులు
కొత్తగూడెం

తే.13-1-2024
ఎటపాక

గీతం దూర విద్య
డిగ్రీ, పీజీ కోర్సుల అడ్మిషన్లు

ప్రజాశక్తి -మధురవాడ : దూర ప్రాంతాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి, వివిధ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ చదువు కొనసాగించాలనుకునేవారికి నామ మాత్రపు రుసుముతో డిగ్రీ, పీజీ కోర్సులు చదువుకునే అవకాశాన్ని గీతం డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ లెర్నింగ్ (సిడిఒఎల్) ద్వారా అందుబాటులోకి తెస్తున్నట్లు సిడిఒఎల్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మొదటి దశలో బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులతో పాటు ఎమ్ఎ ఇంగ్లీషులో ప్రవేశాలను కల్పిస్తున్నామని వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) గుర్తింపుతో నిర్వహిస్తున్న ఈ కోర్సులలో ప్రవేశం పొందేవారికి ఆన్‌లైన్ ద్వారా స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు గీతం సిడిఒఎల్ వెబ్ సైట్‌ను పరిశీలించాలని సూచించారు. జనవరి 14 నుంచి ప్రవేశ దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 29వ తేదీలోగా అందజేయాలని వివరించారు. విశాఖ నగరంలో వారు మరింత సమాచారం కోసం రొండవర్తిలో గల గీతం సిడిఒఎల్ కేంద్రాన్ని సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ జివి శంకరరావు దంపతులు, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో సింగల శ్రీనివాసమూర్తి ఆలయ సంప్రదాయం ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేశారు. వారిని ఈవో సింగల శ్రీనివాసమూర్తి సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భాగ్యేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పలు పతకాలు సాధించిన భీమిలి ప్రాంతానికి చెందిన కోలా విద్యార్థి కోలా భాగ్యేష్ ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలో ఏపి రాష్ట్రం నుంచి పాల్గొననున్నారు. 14 ఏళ్ల లోపు బాలుర 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో భాగ్యేష్ పాల్గొననున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థి మధురవాడ ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక వ్వడం పట్ల స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కరమాని చిన్నబాబు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపల్ హర్షం వెలిబుచ్చారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

15న జూ పార్కు సెలవు రద్దు

ప్రజాశక్తి - ఆరిలోవ : మకర సంక్రాంతి సందర్భంగా సందర్శకుల సౌకర్యార్థం సోమవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను తెరవనున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందని సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బదులుగా మంగళవారం జూ పార్కు సెలవు దినంగా ప్రకటించారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలని కోరారు.

'ఉక్కు'లో 29, 30 తేదీల్లో సమ్మె

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఎస్‌జెపిసిఎస్‌లో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30 తేదీల్లో సమ్మె చేయనున్నట్లు ప్రకటిస్తూ అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు ఉక్కు సిజిఎం (హెచ్ ఆర్) సాత్యకిచక్రవర్తి, పర్సనల్ అధికారి ప్రియాంకలకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు మాట్లాడుతూ, ఎస్‌జెపిసిఎస్‌లో కనీసం రూ.8 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని తదితర పది డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పట్టుదలతో విజయం తథ్యం

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన స్టడీ మెటీరియల్ పంపిణీలో టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు

స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న డిడి, నాయకులు

ప్రజాశక్తి పాడేరు టౌన్: గ్రూప్ 2 అభ్యర్థులు ప్రణాళిక బద్ధంగా పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు అన్నారు. ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు టిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో (నెంబర్ వన్ స్కూల్) గ్రూప్-2 పోటీ పరీక్షల అభ్యర్థులకు శనివారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ అధ్యక్షతన జరిగిన గ్రూప్ 2 పుస్తకాలు పంపిణి కార్యక్రమానికి టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలు ఉన్నత ఉద్యోగాలు సాధించాలని, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని అన్నారు. వెనుకబడిన, ఆదివాసి ప్రాంతాల అభివద్ధికి ప్రభుత్వ ఉద్యోగులు సేవలు చాలా అవసరమన్నారు. గిరిజన సంఘం నిర్వహిస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలు ఎంతో ఆదర్శమని అభినందించారు. గిరిజన ప్రాంతానికి, గిరిజనులకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆదివాసీ మేదావులు ముందుకు రావాలని కోరారు. పోటీ ప్రపంచంలో గిరిజన బిడ్డలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకునేందుకు ఇటువంటి మంచి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ గ్రూప్-2 ఉద్యోగాలకు వందలాది మంది ఆదివాసీ యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకునే పరిస్థితులున్నాయన్నారు. గ్రూప్-2 పరీక్ష మెటీరియల్ ను పోటీ పరీక్ష నిపుణులు, ఎంఎల్ సి కె.ఎస్ లక్ష్మణరావు రూపొందించారని తెలిపారు. ఆదివాసీ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి కోరాలని, గిరిజన ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, యుటిఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు చీకటి నాగేశ్వరరావు, టిడబ్ల్యూటియు జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం, సిఐటియు జిల్లా కార్యదర్శి శెట్టి నాగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ తదితరులు మాట్లాడారు. ఆదివాసి గిరిజన సంఘం ఆదివాసి ప్రాంతంలో గ్రూపు-2 అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ వంటి కార్యక్రమాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆదివాసి హక్కులు, చట్టాలు, జీవన విధానం, సంస్కతిని కాపాడేందుకు కషి చేస్తుందని తెలిపారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న ఆదివాసి స్పెషల్ డిఎస్ సి, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మండలాల నుంచి సుమారు 300 వందల మంది గ్రూప్-2 అభ్యర్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి, చిన్నారావు, నరేష్, మత్స్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

830 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పెదబయలు: పాత రూడకోట జంక్షన్ వద్ద బొలెరోలో తరలిస్తున్న 200 కేజీల గంజాయిని పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు బీహార్ వ్యక్తులను, ఒడిశాకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా వేరొక గంజాయి ముఠా జైపూర్ కు చెందిన ముగ్గురు వ్యక్తులు ముంచంగిపుట్టు మండలం బాబుసాల పంచాయతీ కాంద్రంగివలస గ్రామానికి చెందిన మఠం రాజేంద్రప్రసాద్‌తో నలుగురు వ్యక్తులతో పాటు 630 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వీరితో పాటు బైకు, కారులను స్వాధీనంచ చేసుకున్నారు. వీరిని కోర్టుకు తరలించారు. ఈ దాడుల్లో జి.మాడుగుల సిఐ రమేష్, పెదబయలు ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- అనంతగిరి:పాడేరు, అనంతగిరి మండలాల ఫారెస్ట్ చెక్ పోస్ట్ గేటు నేషనల్ హైవే రోడ్డుపై ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో బీంపోలు పంచాయతీ పరిధి నందకోట గ్రామానికి చెందిన తామరపల్లి, దిలీప్ కుమార్, జీనాబడు పంచాయతీ వెటర్నరీ అసిస్టెంట్ సిరుగం, జగదీష్‌లు తీవ్రమైన గాయాల పాలయ్యారు. ప్రధమ చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేయవల్సి ఉంది

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కశింకోట : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కశింకోట మండలం బయ్యవరం ఎస్‌సి కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బయ్యవరం ఎస్‌సి కాలనీకి చెందిన బరుకు గోవింద (43) శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. శనివారం ఉదయానికి చనిపోయి ఉన్నాడు. ఆయన నోటి నుండి నురగ రావడంతో అనుమానం వచ్చి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డిఎస్‌పి సుబ్బరాజు ఆధ్వర్యాన పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్‌ను రప్పించి ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల నుండి వివరాలు సేకరించారు. మృతుడు గోవింద తల్లి వెంకయ్యమ్మ నుండి ఫిర్యాదు స్వీకరించారు. తన కొడుకు గోవిందది సహజ మరణం కాదని, తన కొడుకు మృతికి తన కోడలు శివలక్ష్మి కారణమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మృతుడు భార్య శివలక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. సిఐ వినోద్‌బాబు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గోవిందకు, ఆయన భార్య శివలక్ష్మికి కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మద్యంలో పురుగులు మందు కలిపి శివలక్ష్మి ఇవ్వడంతోనే గోవింద మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. అదుపులో ఉన్న శివకుమారిని పోలీసులు విచారిస్తున్నారు.

కోడి పందాల శిబిరాలపై దాడులు

రోలుగుంట:మండలంలోని దిబ్బపాలెం గ్రామ శివారులో కోడిపందాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఈ దాడుల్లో 13 మందిని అదుపులో తీసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద రూ.3200 నగదు, ఐదు కోడిపుంజులు స్వాదీనం చేసుకున్నామన్నారు.

పిఎంతో ముఖాముఖికి చురుగ్గా ఏర్పాట్లు

ముఖాముఖి సభా స్థలం

ప్రజాశక్తి-అరకులోయ : మండలంలోని కొత్త భల్లుగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భారత ప్రధానితో ఈనెల 15వ తేదీన పివిటిజి గిరిజనులతో వర్చువల్ విధానంలో ముఖా ముఖి సంభాషించడానికి అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పి.యం.జన్ మన్) పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. దేశంలోని ఆరు జిల్లాల పివిటిజిలతో మాట్లాడతారు. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం కొత్తభల్లుగుడ గ్రామం ఆదివాసీ గిరిజనులతో ప్రధానమంత్రి ముచ్చటిస్తారు. ఈ కార్యక్రమంలో మరో 96 జిల్లాలు కూడా పాల్గొంటున్నాయని ప్రధాని ఆదివాసీలతో మాత్రమే సంభాషిస్తారని అధికారులు తెలిపారు. .కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆదివాసి గిరిజనులతో మాట్లాడి ప్రధానమంత్రి తెలుసుకుంటారు. సభా ప్రాంగణంలో పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు, పీఎం ఉజ్వల్ ఉచిత గ్యాస్, ఆధార్ కార్డుల నమోదు, జల్ జీవన్ మిషన్లో ఇంటింటికి కుళాయిలు, పివిటిజి గ్రామాలలో రహదారుల నిర్మాణం తదితర అంశాలపై ప్రధానమంత్రి పివిటిజి గిరిజనులతో మాట్లాడి తెలుసుకుంటారు.ఈ మేరకు పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. లోటుపాట్లు జరగకుండా ఉండేందుకు వీలుగా అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు.

ట్రోఫీతో బొడ్లంక జట్టు

క్రికెట్ టోర్నీ విజేత బొడ్లంక

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని బొడ్లంక యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బొడ్లంక ఎ జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 22 జట్లు తలపడగా, విన్నర్‌గా బొడ్లంక ఎ టీం, రన్నర్‌గా పందిరి మామిడికోట యువత నిలవగా, మూడో స్థానం పుల్లంగి యువత నిలిచింది. విజేత జట్లుకు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ పల్లాల లక్ష్మి భూపతి రెడ్డి, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, సర్పంచ్ సాదల ప్రేమ కుమార్ రెడ్డి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ లక్ష్మి భూపతి రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగం లేదని కాకుండా వ్యాపారం పరంగా, రాజకీయ నాయకులుగా చదువుకున్న యువత రావాలన్నారు. రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. గంజాయి స్మగ్లింగ్, నాటుసారా వంటి దురులవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఉప సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ ప్రతి సంక్రాంతికి బొడ్లంక యువత జూద క్రీడలకు దూరంగా ఉంటూ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ ప్రేమ కుమార్ మాట్లాడుతూ యువత రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు సాగాలన్నారు. సిఆర్పిఎఫ్ పోలీసు రమణ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వేటుకూరు ఉప సర్పంచ్ కుమార్, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

15న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 15న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ విశాఖపట్నం రానుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ బిధూరి ఛైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తరఫున 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు జిల్లాలో పర్యటించనున్నట్టు వెల్లడించారు. 16, 17వ తేదీల్లో పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, ఇంజినీరింగ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులతో కమిటీ సభ్యులు సమావేశమై సంబంధిత అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సంబంధిత ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఈ మేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై కేంద్రం వెనక్కి తగ్గాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రంలోని మోడీ సర్కారు వెనక్కి తగ్గాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1067వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ - 2 కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, మరిడయ్య మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు అన్ని కార్మిక సంఘాలూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లోపు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుంటే కార్మికవర్గం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణను కార్మికులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని అన్నారు. సుదీర్ఘకాలంగా ఉక్కు పరిరక్షణ పోరాటం కొనసాగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీక్షల్లో ఎస్ఎంఎస్ - 2 విభాగం కార్మికులు సతీష్, జగదీష్, సన్యాసిరావు, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు సంక్రాంతి శోభ

షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు కిటకిట
రూ.300 కోట్ల వ్యాపారానికి ఆస్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ నగరం సంక్రాంతి శోభను సంతరించుకుంది. అన్ని ప్రాంతాలూ శనివారం జనంతో కిటకిటలాడాయి. హోటళ్లు, షాపింగ్ మాల్స్, కైలాసగిరి, ఆర్కే బీచ్.. ఇలా ఎక్కడ చూసినా జనమే జనం. కొత్త సంవత్సరం ఆరంభంతో మొదలైన సందడి సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో మరింత ఆనందంగా మారింది. నగర వీధులన్నీ క్రయవిక్రయాలతో హడావుడిగా కనిపించాయి. వస్త్ర, ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యాపారాలు ఉత్సాహంగా సాగాయి. వ్యాపారుల్లో ఆనందం కనిపించింది.

ఆఫర్ల వర్షం

నగరంలో దుకాణాలన్నింటినీ విద్యుత్ దీపాలతో వినియోగదారులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. జగదాంబ జంక్షన్‌లో కాలు కదపడం కష్టంగా మారింది. అదే విధంగా డాబాగార్డెన్స్, ద్వారకానగర్, రామాటాకీస్, గాజువాక, గోపాలపట్నం ప్రాంతాల్లో అధిక కోలాహలం కానవచ్చింది. వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణదారులు ఆకర్షణీయ రాయితీలను ప్రవేశ పెట్టారు. లక్కీడ్రాలు, భారీ డిస్కౌంట్లు, ఉచిత బహుమతులు అందించారు. దీంతో నగరంలోని జగదాంబ, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, ఆశీలుమెట్ట, సంపత్ వినాయక ఆలయ రహదారి, విఐపి రోడ్డు, డైమండ్ పార్కు జంక్షన్, రైల్వే న్యూకాలనీ, అక్కయ్యపాలెం, పూర్ణామార్కెట్, ఎంవిపి కాలనీ, గాజువాక, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో రోడ్లు వివిధ వస్తువుల వ్యాపారాలతో విపరీతమైన రద్దీగా కనిపించాయి. అతివల మనస్సును ఇట్టే దోచుకునే వస్తువులను హాట్ కేకుల్లా అమ్ముకునేందుకు వ్యాపారులు వినూత్న రీతిలో ప్రచారం చేయడం కనిపించింది. నగర వాసులకు ప్రస్తుత ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త మోడళ్లకు కొదవలేదనే చెప్పాలి. ప్రముఖ వస్త్ర దుకాణాలైన సిఎంఆర్, సిఎంఆర్ సెంట్రల్, వైజాగ్ సెంట్రల్, ఎస్ఆర్ షాపింగ్ మాల్, ఆర్ఎస్ షాపింగ్ మాల్, కంకటాల, కళామందిర్, పాంటలూన్స్, ఎంఎఫ్ షాపింగ్ మాల్, లక్కీ, ఆర్కే షాపింగ్ మాల్, ఎఎస్ఆర్, కళాంజలి, సుమంగళి, బాబా బజార్, తుమ్మిడి బ్రదర్స్, చందన, నీరూస్, కెఎల్ఎం ఫ్యాషన్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ట్విల్స్, కంచి కామాక్షి, కళాంజలి, కళానికేతన్, ఉమెన్స్ వరల్డ్ తదితర దుకాణాలు ఆకట్టుకునే వస్త్రాలతో 15 రోజులు ముందు నుంచే డిస్కౌంట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వాటి వద్ద శనివారం భారీ సంఖ్యలో కొనుగోలుదారులు కనిపించారు.

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న విశాఖలోని ఓ షాపింగ్ మాల్

వస్త్ర వ్యాపారానిదే సింహభాగం

సంక్రాంతి పర్వదినం అందరికీ కన్నుల పండగ. అన్ని వయసుల వారూ కొత్త దుస్తుల్లో ఆ రోజు మెరిసి పోతుంటారు. అందుకే సంక్రాంతి మార్కెట్‌లో వస్త్ర వ్యాపారానిదే సింహభాగం. ఈ ఏడాది ఇప్పటి వరకు వస్త్ర వ్యాపారం రూ.250 కోట్లు దాటిపోయిందని అంచనా. నగరంలో అనుమతి పొందిన షాపింగ్ మాల్స్, పెద్ద పెద్ద వస్త్ర దుకాణాలు సుమారు వంద వరకు ఉండగా, మధ్య, చిన్నస్థాయి దుకాణాలు మరో 900 వరకు ఉన్నాయి. వీటన్నిటిలో సాధారణ రోజుల్లో సగటున రూ.4 కోట్ల వ్యాపారం జరుగుతుంది.

సంక్రాంతి మూడు రోజుల్లోనే సుమారు రూ.200 కోట్ల మేర వ్యాపారం ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. సూరత్, ముంబయి, కొల్‌కతా, బెంగళూరు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఈ పెద్ద పండగకు స్టాక్ తీసుకువచ్చారు. సంక్రాంతి ముగిసే నాటికి వస్త్ర వ్యాపారం మొత్తం రూ.300 కోట్లు చేరుతుందని అంచనా. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌తో పాటు ఫుట్‌పాత్ వస్త్రాల వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి.

నివురుగప్పిన నిప్పల్లా చిరుద్యోగులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న చిరుద్యోగులు నివురుగప్పిన నిప్పుల్లా ఉన్నారు. అంగన్‌వాడీలు మోసపూరిత రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహంతో కనిపిస్తున్నారు. నెల రోజులుగా వీరి ఆందోళన ఉవ్వెత్తున సాగుతోంది. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులంతా తమ డిమాండ్లపై హామీని మాత్రమే పొందారు. మున్సిపల్ వర్కర్ల మేరకు ప్రభుత్వం కాస్త దిగొచ్చి వారి జీతాలను పెంచినా అంగన్‌వాడీ, సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగుల విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో వారు తీవ్ర ఆవేదనకు గురౌతూనే ఉన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు విషయంలో ఏ ఒక్కటైనా చేసి ఉండాల్సిందని, ఏదిఏమైనా పండగ తర్వాతనైనా ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామన్న రీతిలో సమగ్ర శిక్ష ఉద్యోగులు విశాఖ జిల్లాలో స్పందిస్తున్నారు. వారంతా విధుల్లోకి రెండు రోజుల క్రితం చేరారు. అంగన్‌వాడీలు ఎస్మాను ప్రయోగించినా బెదరడం లేదు. జీతం పెంచే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులంతా సమ్మెలో ఉన్న ఈ కాలంలో వీధులు, వార్డులు, విశాఖ నగరం అంతా చెత్త కుప్పలతో కంపుకొట్టింది. వాస్తవానికి జివిఎంసి పబ్లిక్ హెల్త్ విభాగంలో 1200 మందికిపైగా పర్మినెంట్ సిబ్బంది ఉన్నా సరే అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు రోజువారీ చేసే పనిలో భాగస్వామ్యం అవ్వలేకపోయారు. చెత్తను ఎత్తడంలో జివిఎంసి వైఫల్యం చెందింది. సుమారు 5 వేల మంది అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు జివిఎంసిలో ఉన్నారు. వారు సమ్మెలోకి దిగితే ఎలా ఉంటుందో ఇప్పుడు అర్థమైంది.

నాడు హామీలు గుప్పించి..

2019 ఎన్నికలకు ముందు జగన్ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారు. నాడు బీరాలు పలికి నేడు చతికిలపడ్డారు. 'చెప్పాడంటే చేస్తాడంతే' అనే మాట ఆచరణలో అమలుకు ఈ చిరుద్యోగుల విషయంలో నోచుకోలేదన్నది స్పష్టం. పాఠశాల విద్యార్థుల భవిష్యత్, ప్రజలకు అందాల్సిన సేవల విషయంలో ఆటంకం లేకుండా తాము విధుల్లోకి చేరామంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులంతా విశాఖలో మీడియాతో మాట్లాడుతూ చెప్పడం చూస్తే ప్రభుత్వం చేయాల్సిన చొరవ చేయలేదన్నది వారి మాటల ద్వారా స్పష్టమవుతోంది.

అనేక తరగతుల్లో ప్రభుత్వ తీరుపై అసంతృప్తి...

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో వైసిపి సర్కారు తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు, వాలంటీర్లు, పంచాయతీ కార్మికులు.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజానీకంతో కలగలసే చిరుద్యోగులు, స్కీం వర్కర్లు ఉమ్మడి విశాఖ జిల్లాలో వేలల్లో ఉన్నారు. వీరిలో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అంగన్‌వాడీల జీతాలు పెంచండి : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంగన్‌వాడీలకు జీతాలు పెంచే వరకూ ఎన్ని రోజులైనా పోరాడతామని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. 33 రోజుల నుంచి ఎంతో ఐక్యంగా, పట్టుదలగా అంగన్‌వాడీలు వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పోరాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపు చర్యలకు దిగుతోందన్నారు. ఉద్యోగాల నుండి తొలగిస్తామని నోటీసులు జారీ చేయడాన్ని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం 4 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో ప్రభుత్వం 'జీతాలు పెంచం' అని చెప్పడం సమంజసం కాదన్నారు. ఒక పక్క మహిళా సాధికారతే మా ధ్యేయమని చెబుతున్న ప్రభుత్వం మహిళల పట్ల ఈ రకంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు.

18న 'ఎదురులేని మనిషి' ఆడియో విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 18న మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఎదురు లేని మనిషి ఆడియో సీడీని ఆవిష్కరిస్తామని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ తెలిపారు. శనివారం విశాఖ ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా ఎదురులేని మనిషి ఆడియో పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న ప్రజా కంటక పాలనను కళ్లకు కట్టే విధంగా ఇప్పటి వరకూ తాము ఏడు పాటలను విడుదల చేశామన్నారు. అవి మంచి జనాధరణ పొందాయని, ఇప్పుడు 'ఎదురులేని మనిషి' టైటిల్‌తో ఎనిమిదో పాటను విడుదల చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

టాలెంట్ స్ప్రింట్ మహిళా ఇంజినీర్స్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్లోబల్ ఎడ్‌టెక్ కంపెనీ, ట్రాన్స్‌ఫర్మేషనల్ డీప్‌టెక్ ప్రోగ్రామ్‌లను అందించడంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న టాలెంట్ స్ప్రింట్ నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఉంది. ఈ క్రమంలో టాలెంట్ స్ప్రింట్ మహిళా ఇంజినీర్స్ ప్రోగ్రామ్‌లోని ఆరో ఎడిషన్‌ను ప్రారంభించింది. దీనిలో భాగంగా విశాఖలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సిఇఒ, ఎమ్‌డి డాక్టర్ శాంతను పాల్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాలుగల మొదటి సంవత్సరం చదువుతున్న మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులకు 200 సీట్లను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో చేరే విద్యార్థులకు వంద శాతం స్కాలర్‌షిప్ కలదన్నారు. అదనంగా నగదు స్కాలర్‌షిప్ సదుపాయం కూడా ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 9963980259, 9959154371 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దళారులను నమ్మి మోసపోకండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ప్రజారోగ్య విభాగంలో శానిటరీ సూపర్‌వైజర్ ఉద్యోగాల భర్తీ పేరిట కొంతమంది దళారులు వసూళ్లకు పాల్పడుతున్నారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వారి ఉచ్చులో నిరుద్యోగ యువత పడొద్దని హెచ్చరించారు. జివిఎంసి ప్రజారోగ్య విభాగంలో ఎటువంటి సూపర్‌వైజర్ పోస్టులనూ భర్తీ చేయడం లేదని ఆమె పేర్కొన్నారు. దళారులను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని, ఉద్యోగాల కోసం డబ్బులు ఎవరికీ చెల్లించరాదని తెలిపారు.